క్లుప్తంగా

నేడు రఘునాయకస్వామి కళ్యాణం

నాగులుప్పలపాడు: మండలంలోని చదలవాడ రఘునాయకస్వామి కళ్యాణ మహోత్సవాన్ని గురువారం ఉదయం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో అనీల్ తెలిపారు. గరుడపక్షి రాక అనంతరం స్వామివారి కళ్యాణ ఘట్టం ప్రారంభమవుతుందని తెలిపారు. సాయంత్రం గ్రామంలో రథోత్సవం జరుగుతుందన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

ఘనంగా హనుమారెడ్డి జయంతి



హనుమారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రచయితలు, కవులు

ఒంగోలు మెట్రో: ప్రముఖ కవి, రచయిత దివంగత బి.హనుమారెడ్డి ప్రకాశం జిల్లా సాహిత్యానికి చిరునామాగా నిలిచారని ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పొన్నూరు శ్రీనివాసులు కొనియాడారు. హనుమారెడ్డి 83వ జయంతిని స్థానిక రాజా పానగల్ రోడ్డులోని ప్రకాశం జిల్లా రచయితల సంఘం కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. పొన్నూరుతో పాటు సంఘం ప్రధాన కార్యదర్శి యత్తపు కొండారెడ్డి, అద్దంకి సృజన సాహితీ సంస్థ అధ్యక్షుడు గాడేపల్లి దివాకర్‌దత్తు, ముస్లిం రచయితల సంఘం అధ్యక్షుడు షేక్ మహబూబ్ జాన్, ఆంధ్ర సారస్వత పరిషత్ జిల్లా శాఖ అధ్యక్షుడు మూడమంచు వెంకటేశ్వర్లు, అమృత వర్షిని సాహితీ సమితి అధ్యక్షుడు కె.ఎస్.వి.ప్రసాద్, ఆనందమయి సాహితీ సంస్థ కార్యదర్శి అన్ను విజయ కుమారి, ఎర్రన్న సాహిత్య పరిషత్ అధ్యక్షుడు మైనంపాటి సాయికుమార్, ప్రకాశం జిల్లా రచయితల సంఘం సభ్యులు సయ్యద్ ఇస్మాయిల్, గంగిశెట్టి నరసింహారావు, సాహితీ విశ్లేషకుడు ఓరుగంటి ప్రసాద్, శ్రీవారి సేవకుడు పొత్తూరు బదరి, అడ్వకేట్ రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొని హనుమారెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు.

పోలింగ్ సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: పోలింగ్ విధుల్లో పాల్గొనే సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం ప్రకాశం భవనంలో నియోజకవర్గ స్థాయి పోస్టల్ బ్యాలెట్ అధికారులతో సమావేశం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు గడువు ఈ నెల 26వ తేదీ వరకు ఉన్న నేపథ్యంలో సిబ్బంది నుంచి పూర్తి స్థాయిలో దరఖాస్తులు సేకరించాలన్నారు. ఇప్పటికే సేకరించిన దరఖాస్తులను సంబంధిత నియోజకవర్గాల వారీగా అధికారులు సమన్వయం చేసుకుని బదిలీ చేసుకోవాలన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ శ్రీలత, పోస్టల్ బ్యాలెట్ జిల్లా నోడల్ అధికారి విశ్వేశ్వరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నయా జోష్..!

- మంత్రి మేరుగు నాగార్జున నామినేషన్ ర్యాలీ సక్సెస్
- వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ శ్రేణుల్లో నూతనోత్సాహం
- నామినేషన్‌కు భారీగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు, ప్రజలు
- నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి వేలాదిగా హాజరు
- నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ విజయం పక్కా అంటున్న విశ్లేషకులు

చీమకుర్తి: వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి మేరుగు నాగార్జున నామినేషన్ ఆ పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపింది. బుధవారం చీమకుర్తిలోని మున్సిపల్ కార్యాలయంలో తన నామినేషన్ పత్రాలను మేరుగు నాగార్జున సమర్పించారు. ఈ కార్యక్రమానికి ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ సీపీ దర్శి అసెంబ్లీ అభ్యర్థి బూచేపల్లి శివప్రసాదరెడ్డి, మంత్రి తనయుడు మేరుగు చందన్‌నాగ్, మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు, పార్టీ పరిశీలకుడు దేవినేని మల్లికార్జునరావు హాజరై మేరుగు నాగార్జునకు మద్దతు పలికారు. సంతనూతలపాడు నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని భారీ గజమాలలతో మేరుగును సన్మానించారు. అడుగడుగునా ఘనంగా స్వాగతం పలుకుతూ పార్టీ జెండాలు, ప్లకార్డులు ప్రదర్శించారు. విచిత్ర వేషధారణలు, ప్రత్యేక నృత్య ప్రదర్శనలతో ర్యాలీలో కళాకారులు ఆకట్టుకున్నారు. మేరుగు నాగార్జున నామినేషన్ ర్యాలీ వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో జోష్ నింపింది. సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గంలో 1999లో టీడీపీ గెలిచింది. అనంతరం ఇప్పటి వరకు 24 సంవత్సరాలుగా సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గంలో టీడీపీ జెండా ఎగరలేదు. ఈ విషయం ఆ పార్టీలో ఆందోళన కలిగిస్తుండగా, తాజాగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఐదేళ్ల నుంచి అందించిన సంక్షేమ పథకాలు, అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలతో మళ్లీ వరుసగా మూడోసారి సంతనూతలపాడు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ విజయం ఖాయమని తెలుస్తోంది. మేరుగు నాగార్జున సంతనూతలపాడు ఎమ్మెల్యేగా విజయం సాధిస్తారని రాజకీయ విశ్లేషకులు సైతం చెబుతున్నారు. బుధవారం జరిగిన నామినేషన్ ర్యాలీ వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో మరింత ధీమా నెలకొల్పిందని అంటున్నారు.



చీమకుర్తి ర్యాలీలో అభివాదం చేస్తున్న మంత్రి మేరుగు నాగార్జున, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎంపీ నందిగం సురేష్, దర్శి అభ్యర్థి బూచేపల్లి శివప్రసాదరెడ్డి

సంతనూతలపాడు నుంచి ర్యాలీగా చీమకుర్తి తరలిన వైఎస్సార్ సీపీ శ్రేణులు...

సంతనూతలపాడు (చీమకుర్తి): చీమకుర్తిలో బుధవారం జరిగిన మంత్రి మేరుగు నాగార్జున నామినేషన్ ర్యాలీలో పాల్గొనేందుకు సంతనూతలపాడు నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులు ర్యాలీగా తరలివెళ్లారు. జై జగన్.. జై మేరుగు... నినాదాలు మార్మోగాయి. సంతనూతలపాడులోని మార్కెట్ యార్డు వద్ద నుంచి బస్టాండ్ మీదుగా చీమకుర్తి వరకు ర్యాలీ కొనసాగింది. సంతనూతలపాడులోని బస్టాండ్ సెంటర్లో భారీ గజమాలతో మేరుగు నాగార్జున, బాపట్ల ఎంపీ అభ్యర్థి నందిగం సురేష్‌ను సత్కరించారు. అనంతరం వేలాదిగా నామినేషన్ కార్యక్రమానికి తరలివెళ్లారు. వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, సొసైటీ ప్రెసిడెంట్ దుంపా యలమందారెడ్డి, సీనియర్ నాయకులు బొల్లినేని కృష్ణయ్య, జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, ఇతర ముఖ్య ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేశారు.



సంతనూతలపాడు నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి ర్యాలీకి తరలివచ్చిన పార్టీ శ్రేణులు, ప్రజలు



సంతనూతలపాడు బస్టాండ్ సెంటర్లో క్రేన్ సాయంతో భారీ గజమాలతో మేరుగు నాగార్జున, నందిగం సురేష్‌ను సత్కరిస్తున్న దుంపా చెంచిరెడ్డి



విచిత్ర వేషధారణలు, ప్రత్యేక నృత్యాలతో ఆకట్టుకుంటున్న కళాకారులు

వైభవంగా హరిహరుల శాంతి కళ్యాణం



శాంతి కళ్యాణంలో పాల్గొన్న మాజీ మంత్రి శిద్దా రాఘవరావు దంపతులు

చీమకుర్తి: స్థానిక హరిహరక్షేత్రం 18వ వార్షికోత్సవం సందర్భంగా హరిహరుల శాంతి కళ్యాణోత్సవాన్ని బుధవారం కన్నుల పండుగలా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, లక్ష్మీపద్మావతి దంపతులు, శిద్దా కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. హరిహరులకు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను శిద్దా రాఘవరావు దంపతులు సమర్పించారు. కళ్యాణం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

అభయాంజనేయస్వామికి వెండి వాలము బహూకరణ



స్వామివారికి బహూకరించిన వెండి వాలము

ఒంగోలు మెట్రో: స్థానిక మంగమూరుడొంక మర్రిచెట్టుకాలనీలో వెలసి ఉన్న పొలిమేర అభయాంజనేయస్వామి దేవస్థానంలో బుధవారం ఉదయం స్వామివారికి లక్ష రూపాయల విలువ గల వెండి వాలము (స్వామివారి తోక)ను ఉభయ దాతలు అత్తోడి వెంకటేశ్వర్లు దంపతులు బహూకరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు పరాంకుశ సమీర్‌కుమార్ ఆధ్వర్యంలో ముందుగా స్వామివారికి తమలపాకుల పూజ నిర్వహించారు. స్వామివారికి ప్రీతికరమైన సింధూరంతో అష్టోత్తర శతనామావళి పూజలు చేశారు. అనంతరం స్వామివారికి బహూకరించే వెండి వాలముకు ప్రత్యేక పూజలు నిర్వహించి ధూపదీప హారతులతో మూలవిరాట్‌కు అలంకరించారు.

వైఎస్సార్ సీపీలోకి 18 కుటుంబాలు

- పార్టీ కండువాలు వేసి ఆహ్వానించిన ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు: కొత్తపట్నం మండలంలో టీడీపీకి భారీ షాక్ తగిలింది. ఓరుగంటిరెడ్డిపాలెంలో టీడీపీ, సీపీఐ పార్టీలకు చెందిన 18 కుటుంబాలు బుధవారం ఒంగోలులో ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి నివాసానికి చేరుకుని వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి బాలినేని శ్రీనివాసరెడ్డి పార్టీ కండువాలు వేసి వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానించారు. ప్రజాస్వామ్యబద్ధంగా పాలన సాగిస్తూ కుల, మత, వర్గ భేదాలు లేకుండా అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక చేయూత అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మరోమారు సీఎం కావాలని ఆకాంక్షిస్తూ వైఎస్సార్ సీపీలో చేరి పనిచేయనున్నట్లు వారు తెలిపారు. కొత్తపట్నం మండల అభివృద్ధిపై ఎమ్మెల్యే బాలినేని ప్రత్యేక దృష్టి సారించారని, అయినప్పటికీ ఆయనపై విష ప్రచారం సరికాదని అన్నారు. ఆయనకు తామంతా అండగా ఉంటామన్నారు. పార్టీలో చేరిన వారిలో కావలి శ్రీనివాసులరెడ్డి, సనిమిని చక్రవర్తి, దోనే అశోక్‌రెడ్డి, కావూరి సుబ్బారెడ్డి, వాటంబేటి ఆదినారాయణరెడ్డి, కావలి యానాదిరెడ్డి, కావలి హరికృష్ణారెడ్డి, మూలగాని నాంచార్లురెడ్డి, ముచ్చు విష్ణువర్ధన్‌రెడ్డి, సనిమిని నాంచారెడ్డి, సనిమిని శ్రీనివాసులరెడ్డి, కావలి రామాంజనేయులురెడ్డి, ద్వారం పోలిరెడ్డి, రామలింగం నాగరాజురెడ్డి, రాజు ఏడుకొండలు, కోమట్ల లక్ష్మారెడ్డి, రాజు భార్గవరెడ్డి, రాజు సుబ్బారెడ్డి ఉన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కొత్తపట్నం మండల అధ్యక్షుడు రాఘవరావు, నాయకులు తంబి కాంతారావు, జి.శివాజి, బండి శ్రీను, సుధాకర్, సురేష్, ఓరుగంటి నాగరాజు, కోటయ్య, యానాది, ప్రభాకర్, మస్తాన్ వలి, సుభాని తదితరులు పాల్గొన్నారు.



బాలినేని ప్రణీత్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరుతున్న ఇస్లాంపేట ముస్లిం నాయకులు

ఒంగోలు ఇస్లాంపేటలో టీడీపీకి షాక్

ఒంగోలు టౌన్: స్థానిక ఇస్లాంపేటలో టీడీపీకి భారీ షాక్ తగిలింది. బీజేపీతో ఆ పార్టీ పొత్తును నిరసిస్తూ టీడీపీ నాయకులంతా వరుసగా రాజీనామా చేసి వైఎస్సార్ సీపీలో చేరుతున్నారు. బుధవారం ఇస్లాంపేటకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు షేక్ కరిముల్లా (ముల్లా) నాయకత్వంలో 25 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరాయి. ఇస్లాంపేట మదీనా మసీదు వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో అల్లాభక్షు, సైపుల్లా, జిలానీ, అస్లాం, ఫర్దిన్, మన్సూర్, అల్తాఫ్, అమీన్, సమీర్, జవద్, అమీర్, అర్షద్‌లకు వైఎస్సార్ సీపీ యువనేత బాలినేని ప్రణీత్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి వైఎస్సార్ సీపీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన ప్రసంగిస్తూ మైనారిటీలకు అన్ని రకాలుగా అండగా ఉంటామన్నారు. గత పాతికేళ్లుగా ముస్లింలంతా బాలినేని శ్రీనివాసరెడ్డిని బలపరుస్తున్నారని, ముస్లింలు ఆయనను సోదరుడిలా ఆదరిస్తారని తెలిపారు. ముస్లింలకు ఇబ్బంది రాకుండా తాము చూసుకుంటామన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓట్లేసి బాలినేని శ్రీనివాసరెడ్డిని, ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

కార్యక్రమంలో మైనారిటీసెల్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ జలీల్, కార్పొరేటర్ నూర్జహాన్, డివిజన్ అధ్యక్షుడు కాలేషా, జాఫర్, నగర అధ్యక్షుడు మున్వర్, అధికార ప్రతినిధి కావటి రవి, ఖాదర్ బాషా, చాంద్ బాషా, షేక్ కరిముల్లా, బొమ్మినేని మురళి, మూసా, జాఫర్, జల్లిపల్లి సుబ్బులు, హయాతి, ఆసిమ్, సాదిక్, జుబెదా బాజీ, మస్తాన్, నైస్ వలి, షకీలా బేగం, రబ్బాని, రహీం, సయ్యద్ ఇస్మాయిల్, ఒంగోలు బుజ్జి తదితరులు పాల్గొన్నారు.



ఓబన్నపాలెంలో ప్రత్యేక పూజలు చేస్తున్న మంత్రి మేరుగు నాగార్జున, ఎంపీపీ దంపతులు, నాయకులు

ఆలయాలలో మంత్రి మేరుగు ప్రత్యేక పూజలు

నాగులుప్పలపాడు: నామినేషన్ సందర్భంగా మంత్రి మేరుగు నాగార్జున మండలంలోని ఓబన్నపాలెం గ్రామంలో గల కోదండరామస్వామి ఆలయం, ఆంజనేయస్వామి ఆలయంలో బుధవారం ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చీమకుర్తిలో నామినేషన్ కార్యక్రమానికి బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో నాగులుప్పలపాడు ఎంపీపీ దంపతులు నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి, ఏఎంసీ చైర్మన్ మార్నెళ్ల బంగారుబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోలవరపు శ్రీమన్నారాయణ, నాయకులు పులిచర్ల పరంధామిరెడ్డి, పోద పవన్, పోలినేని కోటేశ్వరరావు, దేవరకొండ జయమ్మ వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

సంక్షేమం కోసం ఫ్యాన్ గుర్తుకు ఓటేయండి



కమ్మపాలెంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బాలినేని శ్రీకావ్య

- ఎన్నికల ప్రచారంలో బాలినేని శ్రీకావ్య

ఒంగోలు టౌన్: మహిళల సంక్షేమం కోసం ఎన్నో చట్టాలు చేసి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకునేందుకు ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి కోడలు బాలినేని శ్రీకావ్య కోరారు. బుధవారం స్థానిక 8వ డివిజన్‌లోని క్రిస్టియన్ పాలెం, కమ్మపాలెంలో ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బాలినేని శ్రీనివాసరెడ్డి పాలనలో ఒంగోలు నగరం, నియోజకవర్గం సర్వతోముఖాభివృద్ధి జరిగిందని చెబుతూ వాటి వివరాల తాలూకు కరపత్రాలు పంపిణీ చేశారు. గతంలో ఎన్నడూ లేనంతగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేయడం జరిగిందన్నారు. ప్రతి ఇంటికీ మేలు జరిగిందని, దాదాపుగా ప్రతి ఒక్క కుటుంబం లబ్ధిపొందిందని తెలిపారు. సంక్షేమ పథకాలను మరింత సమర్థవంతంగా కొనసాగించుకునేందుకు వైఎస్సార్ సీపీ తరఫున పోటీ చేస్తున్న బాలినేని శ్రీనివాసరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. మే 13వ తేదీ జరిగే పోలింగ్‌లో ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. ఆ తర్వాత 5 సంవత్సరాల పాటు నిశ్చింతగా ఇంటి వద్దనే ఉండి ప్రభుత్వ సేవలు పొందాలని శ్రీకావ్య సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు తేళ్ల విక్టర్‌పాల్, పీఎస్ కన్వీనర్లు తేళ్ల దిలీప్, తేళ్ల అవినాష్, యానాదిరావు, క్రాంతి, తేళ్ల ఏసుపాదం తదితరులు పాల్గొన్నారు.

దళితుల నోటి కాడ కూడు తీస్తున్నారు

- దళిత సంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు వెంగళరావు

కొత్తపట్నం: టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలు ఏకమై దళితుల నోటి కాడ కూడు తీయడానికి ఒడికడుతున్నారని దళిత సంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తపట్నంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం దళిత సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో అల్లూరు ఎంపీటీసీ సభ్యుడు మిట్నసల శాంతారావు అధ్యక్షతన విలేకర్ల సమావేశం నిర్వహించారు. చప్పిడి వెంగళరావు రూపొందించిన సామాజిక న్యాయం జగనన్నకే సాధ్యం కరపత్రాలను వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు డాక్టర్ చెరుకూరి వీరరాఘవరావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంగళరావు మాట్లాడుతూ రాజ్యాంగాన్ని మార్చాలని, రిజర్వేషన్లు ఎత్తివేయాలని ప్రధాని మోదీ ప్రయత్నిస్తున్నాడని తెలిపారు. అలాంటి మోదీతో టీడీపీ, జనసేన కూటమి కట్టడం ఎంత వరకు న్యాయమని మండిపడ్డారు. అధికార దాహంతో, మోసపూరిత మాటలతో మన ముందుకు రాబోతున్న కూటమిని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి బాలినేని శ్రీనివాసరెడ్డి, ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించి జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుని టీడీపీ కూటమికి గుణపాఠం చెప్పాలని కోరారు. మన హక్కులు, రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి దళిత, గిరిజన, బహుజన, ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీలు ఫ్యాన్ గుర్తుకు ఓటేసి అత్యధిక మెజార్టీతో జగనన్నను సీఎం చేయాలని విజ్ఞప్తి చేశారు. చెరుకూరి వీరరాఘవరావు మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలలో జగనన్న పాలన ఎంత గొప్పగా ఉందో మనందరికీ తెలిసిన విషయమేనన్నారు. దళిత సంఘాలన్నీ జగనన్నకు మద్దతుగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బంకా శ్రీధర్, యూత్ అధ్యక్షుడు ద్వారం నాగరాజు, కోడూరి శ్రీనివాసులు, కట్టా శేఖర్, గౌరవరపు శివాజీ, తంబి సురేష్, మరలపాల సుధాకర్‌రెడ్డి, దోనె రామ్మోహన్‌రెడ్డి, పెద్ది కృష్ణారెడ్డి, తిరుపతిరావు, రామలింగం నాని తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న చప్పిడి వెంగళరావు, వైఎస్సార్ సీపీ నాయకులు

ఆర్థికంగా ఎదగాలంటే జగన్‌ను సీఎం చేసుకోవాలి

కొత్తపట్నం: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, పేద, బడుగు, బలహీనవర్గాల ప్రజలు ఆర్థికంగా ఎదగాలంటే మరోసారి ఒంగోలు ఎమ్మెల్యేగా బాలినేని శ్రీనివాసరెడ్డిని, ఎంపీగా చెవిరెడ్డి భాస్కరరెడ్డిని గెలిపించుకుని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంను చేసుకోవాలని కొత్తపట్నం ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి కోరారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా రాజుపాలెం గ్రామంలో బుధవారం ఆయన పర్యటించారు. ఐదేళ్లుగా రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా అమలు చేసిన సంక్షేమ పథకాలు, పూర్తి చేసిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అంజిరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో అందరూ కూలీనాలీ చేసుకుని, వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తారని తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలతో అలాంటి వారంతా ఆర్థికంగా నిలదొక్కుకున్నారన్నారు. ప్రతి ఇంట్లో ఏదో ఒక పథకం అమలైందన్నారు. రూ.50 వేల నుంచి రూ.4 లక్షల వరకూ లబ్ధిచేకూరిందన్నారు. ఆ నగదుతో చాలా మంది ఆర్థికంగా ఎదిగి ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. మొత్తం 34 సంక్షేమ పథకాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులందరికీ అమలు చేశారన్నారు. ఈ పథకాలన్నీ మళ్లీ అందాలంటే ఎంపీ, ఎమ్మెల్యే రెండు ఓట్లనూ వైఎస్సార్ సీపీ ఫ్యాన్ గుర్తుకు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో రాజుపాలెం సర్పంచ్ భర్త కొండూరు గోవింద్, మాజీ ఎంపీపీ వాయల మోహన్‌రావు, మాజీ సర్పంచ్ దాచూరి గోపాల్‌రెడ్డి, లింగంగుంట వెంకటేశ్వర్లు, రాజుపాలెం అధ్యక్షుడు ఊడ సుబ్రహ్మణ్యం, జిలాని, శేఖర్‌రెడ్డి, మార్టూరి చక్రారెడ్డి, శంఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రాజుపాలెంలో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తున్న కొత్తపట్నం ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి

డబ్బున్న వాళ్లకే కాంగ్రెస్‌లో షర్మిల టికెట్లు

ఒంగోలు సిటీ: డబ్బున్న వాళ్లకే పీసీసీ అధ్యక్షురాలు షర్మిల కాంగ్రెస్ పార్టీ టికెట్లు ఇస్తోందని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీపతి సతీష్ అన్నారు. బుధవారం ఒంగోలు ప్రెస్‌క్లబ్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీపతి సతీష్ మాట్లాడుతూ 46 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ కోసం తమ కుటుంబం ఎంతో కష్టపడి పని చేసిందని తెలిపారు. తమ కుటుంబం చేసిన సేవలను గుర్తించి తనకు కొండపి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా తొలుత అవకాశం కల్పించారన్నారు. బీఫామ్ రాలేదని షర్మిలను అడగ్గా టికెట్ నీకు లేదని చెప్పడంతో చాలా బాధపడ్డానన్నారు. బీఫాం కోసం తన తండ్రి అనేక చోట్లకు షర్మిల కోసం తిరిగారని, అయినా సరిగా స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఢిల్లీ పెద్దలు తన అభ్యర్థిత్వాన్ని మార్చకుండానే రాష్ట్రనేత మార్చి చీకట్లో బీఫామ్‌ను వసుమర్తి రాజశేఖర్‌కు ఇచ్చిందన్నారు. ఇప్పటికైనా తనకు బీఫామ్ ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ టికెట్లు ఎందుకు మారుస్తున్నారని షర్మిలను ప్రశ్నించారు.

సంక్షేమం, అభివృద్ధికే పట్టం కట్టండి

- 20వ డివిజన్‌లో బాలినేని శచీదేవి ఇంటింటి ప్రచారం

ఒంగోలు సబర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు మళ్లీ పట్టం కట్టాలని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి సతీమణి శచీదేవి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. బుధవారం ఒంగోలు నగరంలోని 20వ డివిజన్‌లో వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ పసుపులేటి విజయలక్ష్మి శ్రీనివాసులుతో కలిసి భాగ్యనగర్ నాలుగో లైన్‌లో పర్యటించారు. ఇంటింటికీ తిరిగి వైఎస్సార్ సీపీ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించారు. ఎన్నికల ప్రచార కరపత్రాలు పంపిణీ చేశారు. ×మహిళలతో మమేకం– స్త్రీ శక్తితో శచీదేవి¤ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి నియోజకవర్గంలో బాలినేని చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. పట్టుబట్టి మరీ నగరంలో సొంతిళ్లు లేని నిరుపేదలైన 25 వేల మందికి ఇళ్లపట్టాలిచ్చిన ఘనత బాలినేనికి దక్కుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ గెలిపిస్తే ఇళ్లు కట్టించే కార్యక్రమాన్ని బాలినేని చేపడతారని హామీ ఇచ్చారు. లబ్ధిదారులైన దంపతులకు దుస్తులు పెట్టి మరీ పట్టాలు పంపిణీ చేసిన విషయాన్ని ప్రజలకు గుర్తు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు మోడుబోయిన సురేష్, పీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ మేదరమెట్ల శంకరారెడ్డి, దూళిపాళ్ల ప్రసాదు, కో ఆప్షన్ మెంబర్ రషీద, ఆర్‌టీఓ ఏజెంట్ అంజిరెడ్డి, బ్రహ్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



భాగ్యనగర్‌లో ప్రచారం చేస్తున్న బాలినేని శచీదేవి